www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 29 | జూలై | 2026 పేజీలు : 8


## 87 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం




**ప్రజాపక్షం/కామేపల్లి:** అనుమతులు లేకుండా అక్రమంగా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్న రెండు గ్యాస్ ఏజెన్సీలను చెందిన 87 సిలిండర్లను జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జునరావు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో ఇల్లందుకు చెందిన లక్ష్మీ గ్యాస్, తేజస్విని గ్యాస్ ఏజెన్సీలకు చెందిన సిలిండర్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని సాయి తిరుమల గ్యాస్ ఏజెన్సీకి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా గ్రామాల్లో గ్యాస్ సిలిండర్ల విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారుల నుంచి నిబంధనల ప్రకారం మాత్రమే నగదు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీటీ, ఆర్ఐ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలను
# సాగు చేయాలి



-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
-రైతులకు నష్టం జరగకుండా అవగాహన కార్యక్రమం
-రైతు నేస్తం 100వ ఎపిసోడ్ విసిలో పాల్గొన్న కలెక్టర్

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో రైతు నేస్తం కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగు చేపట్టాలని మంత్రి సూచించారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిర్వహిస్తున్న రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రఘునాథపాలెం మండలంలోని రైతు వేదికలో పాల్గొని విసి ద్వారా రైతులకు అందించిన శాస్త్రీయ వ్యవసాయ సూచనలను

మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు
# పూర్తి చేయాలి

- సాంకేతిక సమస్యలు అధిగమించి నిర్మాణాలు పూర్తి చేయాలి
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలి
- రెండో విడత నిర్మాణాలకు పక్కా ప్రణాళికలు రూపొందించాలి
- సమీక్షా సమావేశంలో కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబ శివ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ మున్సిపల్ కార్పొరేషన్

మిగతా 2లో..

## పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరం




-ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం
-సిపిఐ శిక్షణా తరగతుల్లో బాగం

**ప్రజాపక్షం/కొణిజర్ల :** పాలకుల విధానాలు, పెరుగుతున్న ఆర్థిక అంతరాల నేపథ్యంలో దేశంలో కమ్యూనిస్టుల అవసరం రోజు రోజుకు పెరుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపా రు. పెరిగిన కమ్యూనిస్టుల అవసరాలకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. కొణిజర్ల,వైరా మండలాల స్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు మంగళవారం తనికెళ్లలోని పులిపాటి ఫార్మా కళాశాలలో జరిగాయి. శిక్షణా తరగతులకు ముందు సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ వెంపటి పరశురాములు, సీనియర్ నాయకులు యాకూబ్ అలీ పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. దొండపాటి రమేష్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల బలహీనత పాక్షిక ఘటనేనని కమ్యూనిస్టుల పురోగమనం తథ్యమన్నారు. మారిన రాజకీయ, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో డబ్బు ప్రధానంగా మారిందని అన్ని ప్రధాన రంగాలను డబ్బు శాసిస్తుందన్నారు. రాజకీయాలు డబ్బుతో ముడిపడి ఉండడంతో కమ్యూనిస్టులు వెనకబడ్డారని ఆయన తెలిపారు. నిరంతర ప్రజా పోరాటాల ద్వారా తిరిగి బలోపేతం అయ్యేందుకు గ్రామశాఖలు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. కమ్యూనిస్టులు ప్రజాప్రతినిధులుగా ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందని బూర్జువా పార్టీలకు చెందిన వారు ఉంటే వారికి అనుకూలమైన శాసనాలు మాత్రమే చట్టసభల నుంచి వస్తాయన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ గాడి తప్పిందని చాలా కాలంగా ప్రజలను మోసం చేయడం ద్వారా లబ్ది పొందాలని ప్రయత్నిస్తుందని కానీ యువత, విద్యార్థుల తిరుగుబాటుతో 12 ఏళ్ల మోడీ పాలనలో మొదటి సారి తల వంచక తప్పలేదన్నారు. దేశంలో

మిగతా 2లో..

## కుటుంబానికి డిజిటల్ గుర్తింపు




- రేషన్ కార్డు ఆధారంగా ఐడి
- త్వరలో జిల్లాలో కార్యాచరణకు శ్రీకారం
- రేషన్ కార్డు లేనివారి సంగతేంటి ?

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిలాల్లో ప్రతీ కుటుంబానికి ఒకే అధికారిక డిజిటల్ కుటుంబకార్డు అందుబాటులోనికి తెచ్చేందు కసరత్తు జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అడుగులేస్తున్న క్రమంలో త్వరలో జిల్లాలో కార్యచరణ మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ సభ్యుల వివరాలు ఒకే డేటాబేస్‌లో నమోదు చేసి ప్రభుత్వ సేవలను వేగంగా పారదర్శకంగా అందించేందుకు ఈ కొత్త విధానాన్ని తీసుకురావడం శుభ పరిణామంగా చర్చ సాగుతోంది. ప్రభుత్వం రూపొందించ దలచుకున్న ఈ వ్యవహారంలో కుటుంబ పెద్ద పేరు కుటుంబ సభ్యుల పేర్లు వారి సంబంధం వయస్సు చిరునామ జనన తేది ఆధార్ తదితర వివరాలు సమీకరించి డిజిటల్ రికార్డులు రూపొందించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ మీ సేవ కేంద్రాలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫ్యామిలీ రిజిష్ట్రేషన్ సర్టిఫికెట్ అందించే

మిగతా 2లో..

# ఆరుతడి పంటలను సాగు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వీక్షించారు. ఈసందర్భంగా హైదరాబాద్ నుంచి విసిలో పాల్గొన్న మంత్రి తుమ్మల రైతులకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలన్నారు. రైతులకు ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ తోటల్లో జాజి, మిరియాలు, కోకో వంటి అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినోను దృష్టిలో ఉంచుకుని రైతులు సాంప్రదాయ పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని సూచించారు. అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకు తక్కువ నీటితో స్వల్పకాలికంగా సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులలో నీటి నిల్వలు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశల వారీగా



వినియోగిస్తున్నామన్నారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ రైతులకు ప్రస్తుత పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఏడిఏ (ఎఫ్‌టిసి) సతీష్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవోలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరం

(మొదటిపేజీ తరువాయి)

మోడీ పాలన కారణంగా అప్పుల్లో మునిగిపోతున్నామని రూ.50లక్షల కోట్లు ఉన్నఅప్పు పదేళ్ల కాలంలో రూ.200 లక్షల కోట్లకు పెరిగిపోయిందని తెలిపారు. ప్రైవేటీకరణ పెరిగి ప్రభుత్వ సెక్టార్ రోజు రోజుకు తరిగిపోతుందన్నారు. రాముడి పేరుతో బిజెపి రక్షణ పొందుతుందని కానీ అది ఎంతో కాలం నిలబడదన్నారు. రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ గతంలో అప్పుల పేరు చెప్పి ఇప్పుడు ఎల్‌నినో పేరుతో పబ్బం గడుపుతుందన్నారు. 2016లో ప్రారంభమైన సీతారామ 2019 నాటికి పూర్తయితే ఖమ్మం జిల్లాలో ఇప్పుడు ఉన్న కరువు పరిస్థితులు ఉండేవి కావని అప్పుడు బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ కూడా నిధుల కేటాయింపులో చూపిన వివక్ష కారణంగానే ఖమ్మంజిల్లా కరువు కొరల్లో కూరుకుపోతుందని హేమంతరావు తెలిపారు. ప్రజల కోసం పోరాడాల్సింది పోరాడేది కమ్యూనిస్టులే కాబట్టి కమ్యూనిస్టు శాఖలను విస్తృత పర్చాలని ఇందుకు అధ్యయనం, చర్చలు, సంఘటిత నిర్ణయాలు అవసరం అన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పార్టీ కర్తవ్యాలు, నిర్ణయాల అమలు, ఆందోళనలు అనే అంశాన్ని దండి సురేష్, భారత జాతీయోద్యం కమ్యూనిస్టుల పాత్ర అనే అంశాన్ని జమ్ముల జితేందర్‌రెడ్డి, కులం, మతం వర్గ పోరాటం అనే అంశాన్ని శింగు నర్సింహారావు, ప్రపంచీకరణ భారతదేశంపై దాని ప్రభావం అనే అంశాన్ని ఏనుగు వెంకటేశ్వరరావు బోధించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, మండల కార్యదర్శులు గడల భాస్కర్‌రావు, యామాల గోపాలరావు, మునిగ కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్ణ రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు పాపగంటి సుదర్శన్, ఎ. శ్రీనివాసరావు, మద్దోజు శ్రవణ్, తనికెళ్ల శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# రోగి సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత



**-ఖాళీల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ**

**-ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలపై సమీక్షించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆసుపత్రి నిర్వహణలో సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో వైద్య అధికారులతో ఆసుపత్రి నిర్వహణ, ఎదురవుతున్న సమస్యల, వైద్య సేవల నాణ్యత, రోగి సంరక్షణ వంటి పలు అంశాలపై మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ,అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపి నిర్వహణకు అవసరమైన ప్రామాణిక విధానాలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా మందులు, ఇతర వైద్య సామాగ్రిని నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఏ మందులను ప్రైవేటుగా కొనుగోలు చేయాలని సూచించకూడదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న సమస్యలు మరల తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. పార్కింగ్, సిసి కెమెరాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలపై ప్రత్యేక నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఆసుపత్రిలోని ఓపి విభాగం, వార్డులు,ఐసియు, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥ నరేందర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల పర్యవేక్షకులు డా॥ రాజేశ్వరరావు, వైద్యశాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యాధికారులు, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వందశాతం ఇన్యుమరేషన్ పూర్తయ్యేలా బిఎల్‌ఏలు చూడాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఓటర్ ఎన్యుమరేషన్ ప్రోగ్రాంకు ఆగస్టు 3వ తేదీతో గడువు ముగుస్తున్న నేపథ్యంలో నియోజవర్గంలో 100శాతం ఎన్యుమనేషన్ పూర్తయ్యేలా కృషి జరపాలని శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ బూతు లెవల్ ఏజెంట్లను కోరారు. మంగళవారం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన నియోజవర్గంలోని ఐదు మండలాల బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రెండవ స్థానంలో ఉన్నామని, ఇంకా కొంచెం కృషి జరిగితే మొదటి స్థానంలోకి వస్తామని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఏజెంటు కష్టపడాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని మండలాల్లో నిర్లక్ష్యం కనిపిస్తుందని, దాన్ని వీడి చురుగ్గా పనిచేయాలని కోరారు. 100శాతం పూర్తి చేసిన బిఎల్‌ఓలను రాహుల్ గాంధీ తో ఫోటో దిగే అవకాశం కల్పిస్తున్న నేపథ్యంలో ఈ అవకాశం సత్తుపల్లి నియోజకవర్గంలోని బిఎల్‌ఓలకు కూడా రావాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ విధంగా ప్రతి ఒక బిఎల్‌ఓ కష్టపడాలని కోరారు. 100 శాతానికి చేరేందుకు ఇంకా 23 వేల ఓట్లు మాత్రమే తేడా ఉందని, గడువు లోగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన కొత్త ఓటర్లను చేర్పించాలని, వేరే ప్రాంతంలో ఉన్న ఓటర్లను వాళ్ల ప్రస్తుతం నివాసం ఉండే ప్రదేశంలో చేర్చే విధంగా ప్రయత్నం జరగాలని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ సర్ ప్రోగ్రాం విజయవంతం కావడం కోసం ప్రతి ఒక్కరూ కృషి జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ గోపిశెట్టి రాఘవేంద్రరావు, నియోజవర్గ ఇన్చార్జి దైత రవీంద్ర, సొసైటీ అధ్యక్షులు చల్లగుల్ల కృష్ణయ్య, చల్లగుండ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, నాయుడు వెంకటేశ్వరరావు, మందపాటి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

గృహ నిర్మాణశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మండల ప్రజాపరిషత్ అధికారులతో ఇండ్ల నిర్మాణాల పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండిగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్క పేదకుటుంబం సొంతింటి కల నెరవేరేలా యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అదే విధంగా రాబోయే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగానే పక్కా ప్రణాళికతో సంసిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. ప్రజాధనం వృధా కాకుండా నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీఠ వేస్తూ పేదలకు నాణ్యమైన ఇళ్లను అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. సమీక్షా సమావేశంలో కార్పొరేషన్ కమీషనర్ సుజాత, చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి ఎంపిడిఓలు సుభాషిణి సుస్మిత డిఇలు, ఏఇలు పాల్గొన్నారు.

# కుటుంబానికి డిజిటల్ గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉంటుంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం సంబంధిత రెవెన్యూ అధికారుల డిజిటల్ సైన్‌తో ధృవీకరణ పత్రం జారీ చేయనున్నారు. ఈ ఫ్యామిలీ సర్టిఫికేట్ కేవలం కుటుంబ వివరాల ధృవీకరణ కోసమేనని, దీని వల్ల ఆస్తి హక్కులు, వారసత్వపు హక్కులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్వయంచాలక అర్హత లభించదని అధికారులు పేర్కొంటున్నారు.

**రేషన్ కార్డు లేని వారి పరిస్థితి ఏంటి ..?**

రేషన్ కార్డు ఉన్నవారికే ఫ్యామిటీ డిజిటల్ ధృవీకరణ పత్రాన్ని జారీ చేస్తే జిల్లాలో రేషన్ కార్డులు లేని వారి పరిస్థితి ఏంటనే అనుమానలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకరాం 279190 కుటుంబాలు సుమారుగా ఉన్నాయి. జనాభా పెరుగుదల కారణంగా ప్రస్తుతం 3.2 లక్షల నుండి 3.5 లక్షల కుటుంబాల వరుకు జిల్లాలో ఉండవచ్చనే అంచనా ఉంది. అదిలా ఉండగా జిల్లాలోని 23 మండలాల వారీగా సుమారు 2.6 లక్షల మంది ఉన్నారు. ఇంకా చాలా మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురు చూసున్న వారూ ఉన్నారు. ప్రభుత్వం ఇవ్వదలచిన కటుంబ గుర్తింపు పత్రం 2.6 లక్షల కుటుంబాల వారికి మాత్రమే అందితే మరి మిగతా వారి పరిస్థితి ఏంటీ అనే ప్రశ్న తలెత్తుతోంది. దీనిపై సరైన స్పష్టత లేకపోయినప్పటికీ మీసేవ తహశిల్దార్ కార్యాలయాల ద్వారా నూతనంగా ఇందు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం, ఆధార్ ఓటర్ కార్డుల ద్వారా జనన నివాస పత్రాలు విద్యుత్ బిల్లు ఇంటి పన్ను బిల్లు ఆధారంగా, రెవెన్యూ అధికారుల ఇంటింటి సర్వే ఆధారంగా రేషన్ కార్డులేని కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది.

## ఒకే ఇంట్లో రెండుసార్లు ఆగిపోయిన

# చిన్నారుల చిరునవ్వులు

**- స్నేహితురాలి చివరిచూపు కోసం పాఠశాల ఎదుట ఎదురు చూసిన విద్యార్థులు**

**- 14ఏళ్ల క్రితం కవల సోదరి..ఇప్పుడు వైదికను కోల్పోయిన తల్లిదండ్రులు**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఒక మరణం కుటుంబాన్నే కాదు..ఓ వీధిని, ఓ పాఠశాలను, ప్రజలను ఓ చిన్నానాటి జ్ఞాపకాలను శోకసంసంద్రంలో ముంచెత్తాయి. అలాంటి విషాదాన్నే మిగిల్చింది ఓ చిన్నారి. 14 ఏళ్లప్పుడు ఆ తల్లిదండ్రులు ఏ చిరునవ్వునైతే కోల్పోయారో ఇప్పుడు అదే చిరునవ్వుకు దూరమయ్యారు. ఏదులాపురం మున్సిపాలిటీ 28వ వార్డుకు చెందిన రంగిశెట్టి ఉదయ్‌స్రవంతి దంపతులకు జన్మించిన కవల ఆడపిల్లల్లో ఒకరు పసి ప్రాయంలోనే పేగు సంబంధిత సమస్యతో మృతి చెందారు. అదే సమస్యతో బాధపడుతున్న వైదిక(14)ను తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు భరిస్తూ , వైద్య చికిత్సలు అందిస్తూ ఇంతకాలం కాపాడుకున్నారు. కానీ విధి మరోసారి అదే కుటుంబాన్ని పరీక్షించింది. చికిత్స పొందుతై వైదిక మంగళవారం కన్ను మూసింది. ఒకే సమస్యతో ఇద్దరు కుమార్తెలను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు రోదన చూసి పలువురు కంటతడి పెట్టారు.

**చివరిచూపు కోసం ఎదురుచూసిన స్నేహితులు...**

ఏదులాపురం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 8వ తరగతి చదువుతన్న వైదికకు స్నేహితులు అంటే ఎంతో ఇష్టం. వారితో కలిసి నవ్వుతూ, ఆడుకుంటూ, చదువకుంటూ గడిపిన రోజులు ఇప్పుడు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ఆమె అంతిమయాత్ర పాఠశాల సమీపానికి వస్తోందని తెలిసిన విద్యార్థులు సాయత్రం, వరకు అక్కడే వేచి ఉన్నారు. వాహనం కనిపించగానే పరుగెత్తుకుంటూ వెళ్లి తమ స్నేహితురాలికి చివరిసారి వీడ్కోలు పలికారు. కడసారి ముఖం చూసిన క్షణంలో పలువురు విద్యార్థులు బోరున విలపించారు. అక్కడున్న ఉపాధ్యాయులు, ప్రజలు కూడా ఆ దృశ్యాన్ని చూసి కన్నీళ్లు ఆపుకోలేకపోయారు.

# రుణాల లావాదేవీలు డిజిటల్ పద్ధతిలో జరగాలి



**-నూరు శాతం రుణ రికవరీ లక్ష్యంగా పనిచేయాలి**
**-స్త్రీ నిధి కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్త్రీ నిధి రుణాల లావాదేవీలు పూర్తిగా డిజిటల్ పద్ధతిలోనే జరగాలని అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి కమిటీ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెంది తమ ఆదాయాన్ని పెంచుకునేలా సకాలంలో రుణాలు అందిస్తూ, నూరు శాతం రికవరీ సాధించేలా స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బంది పూర్తి సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేకుండా పరస్పరం అందుబాటులో ఉంటూ మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. వచ్చే నెల నాటికి రికవరీ శాతం ఖచ్చితంగా 60 శాతంకు చేరాలన్నారు. మన స్త్రీ నిధి యాప్ ద్వారానే రికవరీ స్త్రీ నిధి రుణ రికవరీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా సాగడానికి నిధులు ఎక్కడ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు మన స్త్రీ నిధి యాప్ ద్వారా సేకరించాలని ఆదేశించారు. యాప్‌పై ప్రతి ఎస్‌జిహెచ్ మహిళకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పట్టణాలలో వార్డుల వారీగా గ్రామాల్లో వివోల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. డిఆర్‌డివో శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో స్త్రీ నిధి రికవరీ నిధులను సొంతానికి వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడిన వివోఏలపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి రికార్డులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా పిడి, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ జి. రవీంధర్ నాయక్, మెప్మా డిఎంసి, ఏడిఎంసి, టిఎంసి, ఐదు టిఎల్‌ఎఫ్ మెప్మా సిబ్బంది, 20 మండలాల ఏపిఎంలు, స్త్రీ నిధి సిబ్బంది పాల్గొన్నారు.

# హెపటైటిస్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి




**-జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః** హెపటైటిస్(కామెర్లు)పై ప్రజల్లో అవగాహన పెంపొందించి, టీకాలు, పరిశుభ్రత, సకాలంలో పరీక్షలు, చికిత్స ద్వారా వ్యాధిని నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. హెపటైటిస్ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే వైరల్ వ్యాధి అని, హెపటైటిస్ ఏ, బి, సి, డి ఈ రకాల వైరస్ వల్ల ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. ముఖ్యంగా హెపటైటిస్ బి వ్యాధిని టీకాతో పూర్తిగా నివారించే అవకాశం ఉందని, ప్రతి శిశువుకు పుట్టిన వెంటనే హెపటైటిస్ బి జనన మోతాదు టీకా, అనంతరం జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం అన్ని మోతాదులు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పరీక్షించిన సురక్షిత రక్తాన్ని మాత్రమే వినియోగించడం, ఒకసారి మాత్రమే ఉపయోగించే సూదులు, సిరంజీలను ఉపయోగించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిశుభ్రమైన ఆహారం, సురక్షిత తాగునీటిని వినియోగించడం ద్వారా హపటైటిస్‌ను నివారింవచ్చని అన్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకొని, సకాలంలో చికిత్స పొందితే కాలేయం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. హెపటైటిస్‌పై అపోహలను వీడి ప్రతి ఒక్కరూ అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ రామారావు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలోని మహిళా బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల(ఎఎన్ఎం) శిక్షణ పాఠశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. అలాగే కేంద్ర ఔషధ నిల్వ కేంద్రం, సార్వత్రిక రోగనిరోధక టీకాల విభాగాన్ని తనిఖీ చేసి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర వ్యాధుల పర్యవేక్షన కార్యక్రమ అధికారి డాక్టర్ మోతియా, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్య సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, నోడల్ అధికారి డాక్టర్ సమతారాణి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రప్రసాద్, జిల్లా వ్యాక్సిన్, లాజిస్టిక్స్ మేనేజర్ రమణ, జిల్లా కార్యక్రమ అధికారి దుర్గ, డాక్టర్ రాంబాబు, నర్సింగ్ అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




**-రూ. 12వేల హామీని నెరవేర్చాలి**
**-ఆర్టీఏ కార్యాలయం**
**ఎదుట ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12వేలు వెంటనే ఇవ్వాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ మోటార్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా గౌరవాధ్యక్షులు పగడాల మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ మోటార్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ (ఏఐటియుసి) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఖమ్మం ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆర్టిసి తర్వాత లక్షలాది మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే అతి పెద్ద రవాణా వ్యవస్థ ఆటో రంగమేనన్నారు. ఉపాధి కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా జీవనోపాధి కోసం అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ప్రతి రోజు మారుమూల గ్రామాల, పట్టణ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. అటువంటి ఆటో కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత 30 ఏళ్ల నుండి ఆటో కార్మికులు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పోరాటం చేస్తున్నారన్నారు. తెలంగాణ వచ్చి పదేళ్లయినా ఆటో కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని హామీ ఇచ్చి దానిని నేటికి నెరవేర్చలేదన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ఏడాదికి రూ. 12వేలు విడుదల చేయాలన్నారు. పట్టణాలు, నగరాల్లో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసి అక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల శ్రీనివాసరావు, పేరబోయిన మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి షేక్ రఫీ, కోశాధికారి ఆరెంపుల సతీష్, జిల్లా సమితి సభ్యులు మీనుగుల నాగేశ్వరరావు, మేళ్లచెరువు గురవయ్య, రామకృష్ణ, మహేష్, పగడాల మన్మథరావు, కొమ్ము రాజు పాల్గొన్నారు.

## చిమ్మపుడిలో వన మహోత్సవం




**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో వన మహోత్సవాన్ని ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని చెరువుకట్టపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ, సర్పంచ్ కోటేరు నర్సిరెడ్డి మాట్లాడుతూ గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గౌడ అన్నలకు పూర్వ వైభవం తీసుకు రావడానికి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి భావి తరాలకు ఉపయోగపడేలా చూడాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు జోనేబోయిన పాపయ్య, మాజీ సర్పంచ్ దొంతు సత్యనారాయణ, గౌడ సంఘ నాయకులు బోడపట్ల నాగేశ్వరరావు, నాగులమీరా, వెంకటరెడ్డి, సత్యనారాయణ, కోటిరెడ్డి, విష్ణుమూర్తి, నర్సయ్య, బాబు, రాజు, యుగేంధర్, వీరన్న, వీరేష్, లక్ష్మయ్య, ఉపేందర్, నాగయ్య, ఎక్సైజ్ శాఖాధికారులు, స్థానిక పెద్దలు, గీత కార్మికులు పాల్గొన్నారు.

## సరోజనమ్మకు నివాళి



**ప్రజాపక్షం/చింతకాని :** నాగిలిగొండ గ్రామానికి చెందిన కొంగర సరోజనమ్మ గుండె పోటుతో మంగళవారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి నాగిలిగొండలో సరోజనమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, ఏనుగు గాంధీ, మాజీ ఎంపీటీసీ పదిమల వెంకటనర్సయ్య, కొమ్ము పిలిఫ్, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, షేక్ హుస్సేన్, చాట్ల ముఖర్జీ, చాట్ల బాబు, బోజెడ్ల శేషగిరి, మాజీ సర్పంచ్ చాట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం



**ప్రజాపక్షం/చింతకాని :** అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు పేర్కొన్నారు. మండలపరిధిలోని పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు,న్యాయవాది అలవాల శ్రీనివాసరావు 13వ వర్ధంతి వేడుకలు సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పందిళ్ళపల్లిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు స్థూపానికి మడిపల్లి గోపాలరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కామ్రేడ్ శ్రీనివాసరావు నిత్యం పోరాడేవాడన్నారు. మతోన్మాద రాజకీయాలను తిప్పికొడుతూ ,ప్రజాఉద్యమాలు నిర్వహించడమే శ్రీనివాసరావుకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వత్సవాయి పద్మ, పార్టీ నాయకులు వత్సవాయి జానకిరాములు గ్రామశాఖ కార్యదర్శి లింగం కోటేశ్వరరావు,నాయకులు కొల్లి నారాయణ,లింగం ప్రభాకర్,బండ్ల రామయ్య, అలవాల నారాయణ, సాయి, ప్రవీణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో విత్తన మేళా



**ప్రజాపక్షం/కల్లూరుః** రైతు వేదిక నందు రైతుల కొరకు విత్తనమేల కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు రూప రైతులకు వర్షాభావం వర్షాలు మరియు ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడం అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడం లక్ష్యంగా మంగళవారం కాంటీన్ జెన్సి ప్రణాళిక విత్తన మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా వర్షాభాగం పరిస్థితులలో సాగు చేయవలసిన ప్రత్యేక ప్రాంతాలకు అనువైన పంటల ఎంపిక, ఉత్తర శుద్ధి, ఎరువుల వినియోగం చేయడం నివారణ నీటి యాజమాన్య పద్ధతులు పంట యాజమాన్య పద్ధతులు పై ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఖమ్మంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఫార్మసిస్టు పోస్టుల భర్తీ కోసం ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఫార్మసీ (డి ఫార్మసీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బి ఫార్మసీ) అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో నిర్ణీత సమయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఈనెల 30న గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతాయని సూపరింటెండెంట్ తెలిపారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం ఇచ్చిన భూయజమానికి ఇప్పటికీ పూర్తి న్యాయం జరగకపోవడంతో సమస్య కొనసాగుతోందని తెలిపారు. ఈ వివాదం ప్రభావంతో భాగ్యనగర్ తండా, పొలంపల్లి, ఉసిరికాయలపల్లి, గుట్టకింద గుంపు, అప్పిగూడెం సహా పరిసర గ్రామాలకు పలుమార్లు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయం, తాగునీటి సరఫరా, విద్యార్థుల చదువులు, చిన్న వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. స్థలదాతకు తగిన న్యాయం చేస్తూ సబ్ స్టేషన్‌కు సంబంధించిన వివాదాన్ని శాశ్వతంగా పరిష్కరించాలని విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను గ్రామస్తులు కోరారు. ఇకపై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జె గణేష్ డిమాండ్ చేశారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను 27వేల నుంచి 4వేలకే పరిమితం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, ప్రతి పాఠశాలలో త్రాగునీరు, మరుగుదొడ్లు, కరెంట్, ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్‌లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జీఓలు 7,8,9రద్దు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి పేద విద్యార్థులకు 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన విద్యా భరోసా కార్డులు, ఉచిత ల్యాప్ టాప్‌లు వంటి హామీలను అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు శ్రీహరి, రిషి, విజయ్, చరణ్, లోకేష్, కీర్తన, సోనీ, హర్షిని, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఏఈఓగా జానీ బాబా సత్కారం



**ప్రజాపక్షం/కూసుమంచి:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం 100వ ఎపిసోడ్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా, కూసుమంచి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి జానీబాబాకు ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా గుర్తింపు లభించింది. మంగళవారం నేలకొండపల్లి రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య జానీ బాబాకు జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈసందర్భంగా ఏడీఏ రాజేష్, మండల వ్యవసాయ అధికారి రామదుగు వాణి జానీ బాబాను అభినందించగా, వ్యవసాయ శాఖకు చెందిన పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నకిలీ ఎరువుల విక్రయాలపై చర్యలు తీసుకోండి

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎంఆర్పీ కంటే అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నారని, నకిలీ విత్తనాలు, నకిలీ మందులు అమ్ముతున్నారని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు ఆంగోత్ ఆంజనేయులు నాయక్ మండల వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు. రూ 1,350 విలువైన డీఏపీ బస్తాలను రూ 1,600 నుంచి 1,800కు విక్రయిస్తూ, నిల్వలు ఉన్నప్పటికీ రైతులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని అన్ని దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అధిక ధరలు, నకిలీ ఉత్పత్తుల విక్రయాలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని ఏఓను కోరారు.

## యూరియా అందుబాటులో ఉండాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి పీఏసీఎస్ కేంద్రంలో యూరియా నిల్వలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నకరికంటి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో యూరియా కొరత మరింత నష్టాన్ని కలిగిస్తోందన్నారు. యూరియా కోసం రైతులు కేంద్రాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ములకలపల్లి పీఏసీఎస్ కేంద్రానికి తక్షణమే తగినంత యూరియాను సరఫరా చేసి రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎరువుల కొరతతో పంటలు దెబ్బతినకుండా ప్రభుత్వం, వ్యవసాయ శాక అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మణుగూరు ఓసి 2 డిసైడ్ బ్లాక్‌ను సింగరేణి కేటాయించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఓసి టు డిఎస్ సైడ్ బ్లాక్ ను సింగరేణి కేటాయించాలని లేకుండా ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా హెచ్చరించారు. సిపిఐ పినపాక నియోజకవర్గం స్థాయి సమావేశం మంగళవారం మణుగూరు సిపిఐ పార్టీ కార్యాలయంలో జంగం మోహన్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్కే సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ 1979లో మణుగూరులో సింగరేణి ప్రారంభమై అంచలంచలుగా ఈ ప్రాంత అభివృద్ధికి సింగరేణి ఎంతో దోహదం చేసిందని, వేలాది మంది సింగరేణి కార్మికులు ఈ ప్రాంతంలో పని చేసినప్పుడు మణుగూరు కళకళలాడిందని, సింగరేణి అభివృద్ధి కొరకు ఈ ప్రాంత ప్రజలకు కూడా తమ భూములు, ఇండ్లు త్యాగం చేసి సింగరేణి అభివృద్ధికి పాటు పడ్డారని,నేడు సింగరేణి లో ఉన్నటువంటి బొగ్గు బ్లాక్లను ప్రైవేట్ పరం చేయాలని చూస్తుందని దీనివలన సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి తెలంగాణకే వెలుగులు నింపే బొగ్గును రాష్ట్ర ప్రభుత్వం 51% కేంద్ర 49% వాటా ఉన్న సింగరేణిని బ్లాకులను ఎందుకు ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని ఇది సరైన విధానం కాదని ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం స్పందించి మణుగూరు ఓసి డిసైడ్ బ్లాకును సింగరేణికే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి మీద ప్రత్యక్షంగా పరోక్షంగా గుమస్తాలు, కోల్ ట్రాన్స్పోర్ట్ , లారీ ఓనర్స్ బొగ్గుముఠా, కార్మికులు పంచర్ షాపులు, ఇలా ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల మంది ఈ సింగరేణి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని సింగరేణి కేటాయించి మణుగూరు ఓసి ఎక్స్టెన్షన్ పర్మిషన్ తీసుకురావాలని, లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, ముమ్వా వెంకటేశ్వరరావు, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్, బూర్గంపాడు మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్, కరకగూడెం మండల కార్యదర్శి వంగర సతీష్, జిల్లా సమితి సభ్యులు సోందే కుటుంబరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, గడ్డం మనోహరాచారి పత్తిపాటి నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు,మండల సహాయ కార్యదర్శి వేరుపుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం,,ఎస్కే సర్వర్ కొడిమెల రాయల బిక్షం సుజాత,ఆధార్ కొత్తపల్లి సీతారాములు ఆదరణ సురేందర్ ,నోముల రవి ,బాడిస సతీష్, బోసెట్టి సంపత్, ముత్తయ్య, బోసెట్టి సంపత్, నియోజకవర్గ పట్టణ మండల కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## సైలెంట్ కిల్లర్ హైపటైసిస్..!

**-ప్రపంచ హెపటైసిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం**

**-లివర్‌ను కాపాడుకోవడం మన చేతుల్లోనే!**
**-ప్రముఖ గ్యాస్ట్రో, లివర్ వైద్య నిపుణులు సునీల్‌కుమార్ జంగాల**






**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** కరోనా, మంకీపాక్స్ వంటి వ్యాధులైన ప్రజలు అప్రమత్తంగా ఉన్నా.. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మందిని బలి తీసుకుంటున్న మరో ప్రమాదకర వ్యాధి హెపటైటిస్. లక్షణాలు ఆలస్యంగా కనిపించడం వల్ల దీనిని సైలెంట్ కిల్లర్ గా పిలుస్తారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం జూలై 28న ప్రపంచ హెపటైసిస్ దినోత్సవం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

**-హెపటైటిస్ అంటే ఏమిటి?**

హెపటైసిస్ అనేది కాలేయం(లివర్)లో వాపు వచ్చే వ్యాధి. ఇది ప్రధానంగా హెపటైసిస్ ఏ, బి, సి, డి వైరస్‌ల వల్ల వస్తుంది. కొన్ని సందర్భాల్లో మద్యం అధికంగా తీసుకోవడం, ఊబకాయం, కొవ్వు కాలేయం (ఫ్యాటీ లివర్) కొన్ని మందుల దుష్ప్రభావాల వల్ల కాలేయం దెబ్బతింటుంది.

**-లివర్ ఎందుకు అంత ముఖ్యమైనది?**

మన శరీరంలో లివర్ దాదాపు 500పైగా కీలక జీవక్రియలను నిర్వహిస్తుంది. ఆహారం జీర్ణం కావడం, శక్తి నిల్వ చేయడం, విషపదార్థాలను బయటకు పంపించడం, ప్రోటీన్ల తయారీ వంటి ఎన్నో బాధ్యతలు నిర్వర్తిస్తుంది. దెబ్బతిన్నా కొంతవరకు తనను తాను పునరుద్ధరించుకునే సామర్థ్యం కూడా లివర్ ఉంటుంది.

**-హెపటైసిస్ ఎలా వస్తుంది?**

కలుషిత ఆహారం, నీటి ద్వారా(హెపటైసిస్ ఏ, ఈ), వైరస్ సోకిన రక్తం ద్వారా, రక్షణలేని లైంగిక సంబంధాల ద్వారా, కలుషిత సూదులు, సిరంజీల వినియోగం, తల్లి నుంచి శిశువుకు(హెపటైటిస్ బి)

### లివర్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..



ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ప్రజలు కాలేయ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. హెపటైటిస్ అనేది కాలేయాన్ని దెబ్బతీసే వైరల్ వ్యాధి. హెపటైటిస్ బి, సి వైరస్‌లు కలుషిత రక్తం, సూదులు వినియోగం, రక్షణలేని లైంగిక సంబంధాల ద్వారా వ్యాపిస్తుంది. హెపటైటిస్ ఏ కలుషిత ఆహారం, నీటి ద్వారా సోకుతుంది. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే కాలేయ సిరోసిస్, లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. హెపటైటిస్ టీకా తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, స్వచ్ఛమైన ఆహారం, తాగునీరు తీసుకోవడం, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండటం, జంక్ ఫుడ్ తగ్గించి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు. ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని, ముందస్తు నిర్ధారణతో హెపటైటిస్‌ను సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు. అవగాహన టీకాలు, సకాలంలో పరీక్షలే హెపటైటిస్‌పై అత్యుత్తమ ఆయుధాలు అని స్పష్టం చేశారు. ప్రతి నెల మొదటి సోమవారం సాయిరాం గ్యాస్ట్రో హాస్పటల్‌లో ఉచితంగా హెపటైటిస్ టీకా వేయడం జరుగుతుందని ఖమ్మం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

**-సునీల్ కుమార్ జంగాల, ప్రముఖ గ్యాస్ట్రో,**
**లివర్ వైద్య నిపుణులు**
**సాయిరాం హాస్పటల్స్, ఖమ్మం.**

**-ఎవరికి ప్రమాదం ఎక్కువ?**

అధిక బరువు ఉన్నవారు, మధుమేహం ఉన్నవారు, అధిక రక్తపోటు, గుండె జబ్బులు ఉన్నవారు, అధిక మద్యం సేవించే వారు, ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు

**-జాగ్రత్తలు తీసుకుంటే హెపటైటిస్‌ను నివారించవచ్చు**

హెపటైటిస్ ఏ, బి టీకాలు వేయించుకోవాలి, పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు తీసుకోవాలి, బయట జంక్‌ఫుడ్, అధిక నూనె పదార్థాలు తగ్గించాలి, ఆకుకూరలు, పప్పులు, ధాన్యాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి, మద్యపానం, ధూమపానం మానుకోవాలి.

**-ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం చరిత్ర**

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్యూహెచ్ఓ) 2010 నుంచి ప్రతి సంవత్సరం జూలై 28ను ప్రపంచ హెపటైటిస్ దినోత్సవంగా నిర్వహిస్తోంది. హెపటైటిస్ వైరస్‌ను గుర్తించిన శాస్త్రవేత్త డాక్టర్ బారూచ్ బ్లంబర్గ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ తేదిని ఎంపిక చేశారు.

## నిదుర కనులలో మురిసిన కశ్విక భవితవ్యం చిగురించేనా!

**- దయా హృదయాలు చిన్నారి కశ్వికకు ప్రాణభిక్ష పెట్టండి**
**- అరుదైన జన్యువ్యాధితో మృత్యువుతో పోరాడుతున్న చిన్నారి**
**బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ కోసం రూ.50లక్షల సాయం అవసరం**
**- మానవత్వంతో ముందుకు రావాలని తల్లిదండ్రుల వేడుకోలు**






**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** అమ్మ ఒడిలో అల్లారుముద్దుగా పెరిగి, తోటి చిన్నారులతో ఆడిపాడాల్సిన వయసులో చిన్నారి కశ్విక ఆసుపత్రి ఐసీయూలో ప్రాణాలతో పోరాడుతోంది. నిదుర కనులలో ఎన్నో కలలు నింపుకున్న ఆ చిన్నారి భవిష్యత్తు నేడు దాతల దయపై ఆధారపడటం ప్రతీ ఒక్కరినీ కలిచివేస్తోంది. చిన్నారుల చిరునవ్వులు చూడాల్సిన సమాజం, ఒక అమాయక చిన్నారి ప్రాణాల కోసం చేయూత కోరాల్సిన పరిస్థితి నిజంగా హృదయ విదారకం. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన కాంపాటి రవీందర్‌సృజన దంపతుల కుమార్తె కశ్విక అరుదైన జన్యు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధి కారణంగా ఆమె ఊపిరితిత్తులు క్రమంగా దెబ్బతింటుండటంతో శ్వాస తీసుకోవడం రోజు రోజుకూ కష్టమవుతోంది. చిన్న చిన్న ఇన్‌ఫెక్షన్లే ఆమె ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని వైద్యులు తెలిపారు. చిన్నారి ప్రాణాలను కాపాడాలంటే అత్యవసరంగా బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిందేనని వైద్య నిపుణులు సూచించారు. అయితే ఈ చికిత్సకు సుమారు రూ.50లక్షలు ఖర్చవుతుండటంతో నిరుపేద కుటుంబానికి అది అందని భారంగా మారింది. ఒకవైపు కన్నబిడ్డను కాపాడుకోవాలనే తల్లిదండ్రుల ఆరాటం..మరోవైపు భారీ వైద్య ఖర్చు వారిని కన్నీటి పర్యంతం చేస్తోంది.‘ మాపాపను కాపాడండి..మీ చిన్న సహాయం మా బిడ్డకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది’ అంటూ రవీందర్‌సృజన దంపతులు దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు సేవా భావం కలిగిన ప్రతీ ఒక్కరినీ హృదయపూర్వకంగా వేడుకుంటున్నారు. ఒక్కో చేయూత.. ఒక్కో విరాళం.. ఒక్కో మంచి మనసు.. చిన్నారి కశ్విక జీవితంలో కొత్త వెలుగును నింపగలదు. మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని నిరూపించే సమయం ఇది. మనం అందించే చిన్న సహాయం ఓ చిన్నారి ప్రాణాలను కాపాడి, ఆమె బాల్యానికి మళ్లీ చిరునవ్వులు తీసుకురాగలదు. కశ్విక కళ్లలో మళ్లీ ఆనందం మెరవాలంటే..ఆమె అడుగులు మళ్లీ ఆటపాటలవైపు సాగాలంటే.. సమాజం మొత్తం ఒక కుటుంబంలాగా నిలబడి చేయూత అందించాలి. పిండిప్రోలు గ్రామంలోని యువకులు చిన్నారి ప్రాణాలను కాపాడటానికి అన్ని విధాల విరాళాలు సేకరిస్తున్నారు. దయా హృదయములు ముందుకు వచ్చి ఈ చిన్నారి జీవితంలో ఆశాకిరణం కావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు...సహాయం అందించవలసిన ఫోన్‌ఫే నెంబరు: 70950 21080

## ఇంచార్జి పాలన.. అర కొర సిబ్బంది..!




**ప్రజాపక్షం/పెనుబల్లి:** నిత్యం ప్రజలు సమస్యల కోసం రాకతో సందడిగా ఉండే మండల పరిషత్ కార్యాలయం నేడు బోసిపోయి దర్శనం ఇస్తుంది. ఫెన్షన్, యువవికాసం.నూతనం గా ఫెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులు, పంచాయితీ లలో పనుల కోసం ఇలా నిత్యం ప్రజలు ఎంపీడీఓ కార్యాలయానికి వస్తారు. వారికి సమాచారం అందించేవారు ఉద్యోగులు ఇది ఒకప్పుడు. ఇప్పుడు ఎంపీడీఓ బదిలీ అయ్యారు. ఇంచార్జి ఎంపీడీఓగా ఎంపీవో భాధ్యతలు నిర్వహిస్తున్నారు. కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్(యుడిసి) జూనియర్ అసిస్టెంట్ (యల్‌డిసి) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పంచాయతీ ఆపరేటర్ పోస్టులు ఏడుగురు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు ఆపరేటర్ లు ఉన్నారు. మండలంలో 33 పంచాయతీ లు ఉండగా 33 మంది కార్యదర్శి లు విధుల్లో ఉండాలి కానీ 25 మంది కార్యదర్శి లు విధులు నిర్వహిస్తున్నారు. ఎనిమిది మంది కార్యదర్శి లు పక్క పంచాయతీ లకు ఇంచార్జి భాధ్యతలు నిర్వహిస్తున్నారు. అసలే వర్షకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది.ప్రజలు సమస్యలతో వస్తే ఎవరికీ తెలపాలి. ఎంపీడీఓ ఇంచార్జి పాలన పర్యవేక్షణ మాత్రమే అని నిధులు మంజూరు లేదని ఉన్నతధికారులకు నివేదికలు పంపుతారు. అదే ఎంపీపీ,జడ్పీటీసీ,ఎంపీటీసీ వంటి ప్రజా ప్రతినిధులు ఉంటే సమస్యల విషయం లో ఎమ్మెల్యే, ఎంపీ మంత్రుల ద్వారా నిధుల మంజూరు జరిగేది. ప్రజా ప్రతినిధులు ఉంటే గ్రామల ప్రజలు తమ సమస్యలు పరిస్కారం కోసం కార్యాలయానికి వచ్చేవారు. ఉద్యోగులు బదిలీ పై వెళుతున్నారు. కానీ ఆస్థానం లో కొత్తవారి నియమకం జరగటం లేదని పాలకులు సైతం మండల పరిషత్ ల పై ద్రుష్టి సారించి నిధుల మంజూరి, సిబ్బంది నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లాలో ఒక్క ఎకరం కూడా ఖాళీగా ఉంచొద్దు

**-పప్పుధాన్యాలు పండించేలా చైతన్యం కల్పించాలి**
**-జిల్లాలోని ఆదర్శ రైతులు, ఉత్తమ అధికారులకు సన్మానం**
**-జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** జిల్లాలో ఒక్క ఎకరం కూడ ఖాళీగా ఉంచకుండా పప్పు దినుసులు సాగు చేసేలా రైతులలో చైతన్యం కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య సూచించారు. స్థానిక రైతు వేదిక లో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు నేస్తం వంద ఎపిసోడ్ సందర్భంగా జిల్లా కు చెందిన ఆదర్శ రైతులను, ఉత్తమ వ్యవసాయ విస్తీరణాధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 30 శాతం వర్షపాతం నెలకొందన్నారు. వరి పంటలు వేసి రైతులు నష్టపోవద్దని సూచించారు. బోర్, బావుల పై ఆధారపడి వరి నాట్లు వేస్తున్నారని.. కానీ వాటిలో భూగర్భజలాలు రోజు రోజుకు పడిపోతున్నాయన్నారు. అంతే కాకుండా విద్యుత్ సౌకర్యం కూడ అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. దీని వలన రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దన్నారు. అందుకే రైతులు పప్పు దినుసులు మరియు నీటి తక్కువగా తీసుకునే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల ఎకరాలకు గాను, ప్రస్తుతం 50 వేల ఎకరాల వరకు వరి సాగు చేశారని అన్నారు. రైతులు ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకోవాలని సూచించారు. జిల్లా సాగు భూమి అంతా సాగులోకి రావాలని..కానీ వరి పంట మాత్రం వేయవద్దని సూచించారు. ఆగస్టులో వర్షాలు వచ్చినప్పటికీ అవి తాగునీరు కు మాత్రమేనని తెలుసుకోవాలని సూచించారు. రైతు నేస్తం 100 ఎపిసోడ్ లో జిల్లా కు చెందిన రైతులు రాష్ట్ర స్థాయిలో అవార్డు లు పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయం లో నేలకొండపల్లి మండలం కు చెందిన రైతులు ప్రత్యేక స్థానం పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మా పీడీ, బీ.సరిత, కూసుమంచి ఏడీఏ రాజేష్ కుమార్, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, సర్పంచ్ దీరావత్ ఆశోకరాణి, రైతు ప్రతినిధులు మట్టా దుర్గారెడ్డి, మేకల వెంకటేశ్వర్లు, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, యలమద్ది లెనిన్, భాస్కర్ రావు, వెంకటరెడ్డి, సీత్యానాయక్, ఏఈవో లు దుర్గాభవాని, శిరీష, అవినాష్, ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన సిబ్బందికి రెమ్యూనరేషన్ వెంటనే విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జనగణన తొలి దశ సర్వేలో విధులు నిర్వహించిన సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు బకాయి రెమ్యూనరేషన్‌ను వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు జోగా రాంబాబు, ఇస్లావత్ హాతిరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జనగణన విధుల్లో పాల్గొన్న సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు తక్షణమే జారీ చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్, యూడైస్ నమోదు ప్రక్రియ కోసం అవసరమైన పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు, ఇతర ధ్రువపత్రాల జారీలో జాప్యం చేయకుండా వెంటనే మంజూరు చేయాలని మండల తహసీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు.

## యోగాసనలో గోల్డ్ మెడల్ సాధించిన గిరిజన విద్యార్థిని కావేరి





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో నిర్వహించిన యోగాసన పోటీల్లో ఆళ్లపల్లి మండలం లక్ష్మీ పురం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని పూనెం కావేరి గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ప్రస్తుతం మణుగూరు గిరిజన పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కావేరి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకోవడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా, గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## బీఎల్‌ఏలతో కాంగ్రెస్ సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** చండ్రుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లమోతు రమణ ఆధ్వర్యంలో ఖమ్మం పార్లమెంట్ కోఆర్డినేటర్ గోపిశెటటి రాఘవేందర్ 27 బూత్‌ల బీఎల్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలను సమీక్షిస్తూ, ఒక్క ఓటు కూడా తప్పి పోకుండా జాబితాలను పకడ్బందీగా సిద్ధం చేయాలని సూచించారు. ఈసమావేశంలో తుమ్మ రాంబాబు, చర్ల దుర్గాప్రసాద్, భద్రాద్రి జిల్లా దిశా కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, మండల కోఆర్డినేటర్ దిలీప్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కృష్ణవేణి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్, సర్పంచులు, బీఎల్‌ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ మండల అధ్యక్షుడు సోయం కామరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు జూలై 30న కోడి సీతమ్మ నివాసంలో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం లక్ష్మీ నగర్‌లో స్టీరింగ్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఆదివాసీ విద్యార్థులు, యువకులు, మేధావులు, పెద్దలు, మహిళలు, ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు తమ గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించి, ఉదయం 11గంటలకు మండల కేంద్రానికి చేరుకుని ప్రదర్శన, జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో కొమురం దామోదరరావు, సరియం కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌క్యూఐ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్పిరిట్ క్వెస్ట్ ఇంటర్నేషనల్ చేసిన సేవలు అభినందనీయమని ఇండియా బిషప్ ..రమేష్ బాలన్ అన్నారు. మండల పరిధిలోని కొత్తకొత్తూరు లో దహించు అగ్ని కృపా ప్రార్థనా మందిరం లో పాస్టర్ బిషప్ వై.సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 20 మంది సేవకులకు మ్యారేజ్ లైసెన్స్ లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్ క్యూఐ పాస్టర్ల సంక్షేమం కోసం పని చేస్తుందని పేర్కొన్నారు. మారుమూల గ్రామాలలో సేవ చేస్తున్న పాస్టర్ల ను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం ను అందించటమే సంస్థ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. త్వరలో ఈ సంస్థలో పని చేసే పాస్టర్ల కు సామాజిక ఆరోగ్య భద్రతలను కల్పించనున్నట్లు. తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిషప్ జీ.ప్రకాషం, జోనల్ బిషప్ సతీష్ రెడ్డి, వై.లలితరెడ్డి, డి.ధనశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా 17వ మహాసభలను జయప్రదం చేయండి



**కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీయే నని సత్తుపల్లి ఎమ్మెల్యే, ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా 17వ మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షురాలు డా. మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఆగస్టు 23, 24 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్న ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా 17వ మహాసభల సందర్భంగా స్థానిక లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో మహాసభల కరపత్రాన్ని ఆమె మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గ సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ అనేక చారిత్రాత్మక పోరాటాలు నిర్వహించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభల ఆహ్వాన సంఘం కార్యదర్శులు దండు ఆదినారాయణ, నిమ్మటూరు రామకృష్ణ మాట్లాడుతూ, ఏఐటీయూసీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ఖమ్మం జిల్లా మహాసభలు సత్తుపల్లిలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణను రూపొందించి కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి, పరిసర ప్రాంతాల ప్రజలు, కార్మికులు మహాసభలకు సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహాసభల చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, ఆహ్వాన సంఘం కోశాధికారి తడికమళ్ల యోబు, గాదె చెన్నకేశవరావు, బీసీ సంఘం అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, బీసీసీబీ డైరెక్టర్ చల్లగల్ల కృష్ణయ్య, రాముతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రధానితో ముఖాముఖిలో ఎస్‌బిఐటి విద్యార్థులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్వర్ణ భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బిఐటి) ఖమ్మం విద్యార్థులు మరోసారి విశిష్టమైన గుర్తింపు పొందారు. వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మై భారత్ కార్యక్రమం ద్వారా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో ముఖాముఖి సంభాషించే అరుదైన అవకాశానికి ఎస్‌బిఐటికి చెందిన 10 మంది విద్యార్థులకు దక్కింది. ఈ అరుదైన అవకాశం విద్యార్థులకు దేశ నిర్మాణంలో యువత పాత్ర, నాయకత్వ లక్షణాలు సామాజిక బాధ్యతలు, భారతదేశ అభివృద్ధి దిశగా తమ ఆలోచనలను పంచుకునే గొప్ప వేదికగా నిలిచింది. ఖమ్మంజిల్లా తరుపున ఈ కార్యక్రమానికి ఎంపిక కావడం ఎస్‌బిఐటికి ఎంతో గర్వకారణమని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థులు విద్యలోనే కాకుండా సహ పాఠ్య, సామాజిక సేవ నాయకత్వం, జాతీయ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. తమ కళాశాల ఇటువంటి కార్యక్రమాలను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. ఎస్‌బిఐటి కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానం, విలువల ఆధారిత విద్య, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందని వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ అభినందించి తమ విద్యార్థులకు ఇట్టి సదావకాశాన్ని ఇచ్చిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా యువ అధికారి ఎం. వెంకట్ రాంబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్ పాల్గొన్నారు.

# సాంకేతికతతో నేరాలు ఛేదించాలి : సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నేరాలను త్వరితగతిన ఛేధించేందుకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రికవరీలు పెంచాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశించారు. మంగళవారం స్థానిక సెంట్రల్ క్రైం పోలీస్‌స్టేషన్ ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిసిఎస్ సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. దోపిడిలు, దొంగతనాలు, నేరాలు గుర్తించడంలో దర్యాప్తు అధికారులకు అందిస్తున్న సహాయాన్ని అభినందించారు. నేరస్తుల కదలికలకు సంబంధించి ముందస్తు సమాచారం సేకరణలో సిసిఎస్ పోలీసుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణలో కీలకంగా ఉన్న సిసిఎస్‌ను పటిష్ట పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సిపి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రధానంగా చోరీలో పోగొట్టుకున్న సొమ్ము, సొత్తు రికవరిలో ప్రత్యేక దృష్టిసారించాలని స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నేరాలు అదుపుచేసేందుకు ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోవటం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. దర్యాప్తు వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాల ఏర్పాటు పై దృష్టిసారించాలన్నారు.

## ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కార్పోరేషన్ కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజును ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఖమ్మం కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజును కమిషనర్ అభిషేక్ ఆగస్త్య మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. ఇరువురు పరిచయాలు చేసుకుంటూ నగర పరిపాలన ప్రజా సేవలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : ఎఐటియుసి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ మోటార్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభు త్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అశ్వారావుపేట కేంద్రంలోని ఆర్టిఏ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల ఎదుట నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటీయూసి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇస్తున్న రూ.12వేలు తక్షణమే విడుదల చేయాలని, ఆర్‌టిఏ కార్యాలయంలో ఆటోలకు రేడియం స్టిక్కరింగ్ మినహాయించాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఓలా, ఉబర్, రాపిడో స్థానంలో ప్రభుత్వమే ఒక యాప్‌ను తీసుకురావాలని, ఈ చలాన్‌ను వినహాయించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు వెంటనే పెంచాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముందుగా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఎఐటీయూసి రాష్ట్ర సమితి సభ్యులు షేక్.అబ్బాస్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ, పటాన్‌జలాల్, మండల నాయకులు దోమల అనీల్, ముత్తు, ఆటో సెంటర్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, ప్రవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌కిడ్జ్ జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణ సహిత జ్యూట్ బ్యాగులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు.కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్యతో కలిసి జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచాలని పర్యావరణ సహిత జ్యూట్ బ్యాగులను వినియోగించాలని కోరారు. స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను తయారు చేయించి అందరికీ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ పాఠశాల ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను తయారు చేసి అందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు.పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను విద్యార్థులు తెలుసుకుని ఆచరించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు సిపిఐ శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా స్థాయి శిక్షణా తరగతులు బుధవారం ఖమ్మం ఎన్నెస్టి రోడ్డులోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సిపిఐ ఖమ్మం నియోజక వర్గ కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని ఈ శిక్షణా తరగతులకు సభ్యులు సకాలంలో హాజరు కావాలన్నారు. పార్టీ నిర్మాణం, ప్రస్తుత రాజకీయాలు , కర్తవ్యాలు అనే అంశంపై బాగం హేమంతరావు, స్వాతంత్రోద్యమం కమ్యూనిస్టు పార్టీ పాత్ర అనే అంశంపై జమ్ముల జితేందర్ రెడ్డి బోధిస్తారని తెలిపారు. కులం, మతం వర్గ పోరాటం అనే అంశాన్ని శింగు నర్సింహారావు, పార్టీ కార్యాచరణ ప్రచారం అనే అంశాన్ని దండి సురేష్ బోధిస్తారని జానిమియా తెలిపారు.

# సైబర్ సెక్యూరిటీ ఏఐపై అవగాహన




**ప్రజాపక్షం/మధిర:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిరలో కెరీర్ గైడ్స్ సెల్ ఆధ్వర్యంలో హానీవెల్ మల్లీ నేషనల్ కంపెనీ, భారత్ కేర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కమీషనరేట్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సమన్వయంతో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్ట్ నెలలో నిర్వహించనున్న సర్టిఫికెట్ కోర్సు, దాని ప్రాముఖ్యత కోర్సులో బోధించనున్న అంశాలు, అలాగే కోరుస పూర్తి చేసిన విద్యార్థులకు లభించే ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాల గురించి ప్రధాన వక్త సీనియర్ కోఆర్డినేటర్ వేసకూరి నాగసాయి విద్యార్థులకు వివరించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశఖూల వైస్ ప్రిన్సిపాల్ కెరీర్ గైడెన్స్ కమిటీ సభ్యురాలు జి.అరుణ, విద్యార్థిని, విద్యార్థులతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/మధిర:** మధిర అభివృద్ధిలో భాగంగా గతంలో మంజూరైన రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి స్థలం పరిశఖులన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి అధికారులు ఎస్సీ, జేఏ, చైర్‌పర్సన్ సామినేని సుజాత, రామనాథం, వైస్ చైర్మన్ కోనదని, కౌన్సిలర్లు, కాంగ్రేస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వనంవారి కిష్టాపురంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని వనం వారి కిష్టాపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచి, ఉపసర్పంచులు పర్నకోల జ్ఞాన సరళ ఆరోగ్య మేరీ, పొదిలి గోపీచంద్ ప్రారంభించారు. జంగాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ సహకారంతో శ్రీ సాయిరామ్ హాస్పిటల్ వైద్య బృంధం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్య సేవలు అందించింది. ఈ మేరకు గ్రామ ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ప్రతినిధులు, శ్రీ సాయిరామ్ హాస్పిటల్ వైద్య బృంధం, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేసి, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# మండలంలో సర్ 91% పూర్తి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో 63 పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల జాబితా సవరణ సర్ 91 శాతం పూర్తి అయినట్లు తహశీల్దార్ బ్రహ్మేశ్వర రావు తెలిపారు. కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల, బత్తులపల్లి, పేరువంచ, ముచ్చవరం తదితర గ్రామాలలో బిఎల్వోలు సకారంతో ఓటర్ల జాబితాను సవరిస్తున్నట్లు మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో పూర్తి చేయనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. తహశీల్దార్ బ్రహ్మేశ్వరరావు సమక్షంలో ఉదయం సాయంత్రం బిఎల్ఓ బి ఎల్ ఎ సహకారంతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎప్పటికప్పుడు జిపిఓ పంచాయతీ కార్యదర్శులు సహకరిస్తున్నట్లు వివరించారు.

# భూగర్భ జలాలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

## ఆరు తడి పంటలు, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి : కలెక్టర్ అంకిత్




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశాల సందర్భంగా రెండు రోజులపాటు జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. సమావేశంలో జూలూరుపాడు మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, సాధించాల్సిన లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచులతో విస్తృతంగా చర్చించారు. జలసిరి కార్యక్రమం కింద ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ మరుగుదొడ్లు, ఫారం పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకుల నిర్మాణం, అలాగే ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో సుమారు 40 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు నమోదైందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సాధారణం కంటే అధిక వర్షాలు కురిసినప్పటికీ, ఈ ఏడాది పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. దాదాపు 25 సంవత్సరాల తర్వాత ఎల్‌నినో ప్రభావం కారణంగా అధిక ఉష్ణోగ్రతలు, గాలిలో వేడి శాతం పెరగడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ, నీటిపారుదల, పశుసంవర్ధక, విద్యు తదితర శాఖలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో నాగలక్ష్మి మాట్లాడుతూ జూలూరుపాడు మండలానికి 99 ఫారం పాండ్ల నిర్మాణ లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 29 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం నాలుగు ఫారం పాండ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. గాంధీనగర్, గుండ్లరేవు, కాకర్ల, కొత్తూరు, దలవల తండా గ్రామాల్లో ఇప్పటివరకు ఫారం పాండ్లు గుర్తించలేదని, ఆయా గ్రామాలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పర్కొలేషన్ ట్యాంకులు, ఫారం పాండ్లు ఏర్పాటు చేసేలా సర్పంచులు, అధికారులు రైతుల్లో అవగాహన కల్పించి సహకరించాలని ఆమె కోరారు. అనంతరం శాఖల వారీగా మండలంలో చేపడుతున్న కార్యక్రమాలను మండల స్థాయి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శైలజ, తాసిల్దార్ శ్రీనివాస్, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీలో డీపీఓ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయితీ అధికారి(డీపీఓ) అనూష బూర్గంపాడు గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, గ్రామ పంచాయితీ కార్యదర్శి సంపత్ శ్రీనివాస్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. తనిఖీ సందర్భంగా గ్రామ సర్పంచ్ మంద నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్నతో పాటు పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సిరెడ్డికి ఘన సత్కారం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం 100వ ఎపిసోడ్ పూర్తి చేసుకున్న సందర్భంగా రైతులకు సాంకేతిక సేవలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి ఉత్తమ రైతులు, అధికారులను ప్రభుత్వం సత్కరించింది. ఈసందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మోరంపల్లిబంజర్ గ్రామానికి చెందిన ఉత్తమ రైతు గాదె నర్సిరెడ్డి విశిష్ట సత్కారానికి ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా వ్యవసాయ అధికారి వి బాబురావు చేతుల మీదుగా ఆయన సత్కారం అందుకున్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో పలు ఎపిసోడ్లలో చురుకుగా పాల్గొంటూ ఆధునిక సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలు, పంటల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించినందుకు గాదె నర్సిరెడ్డికి ఈ గుర్తింపు లభించింది. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు ఆయనను అభినందిస్తూ రైతు సేవల్లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# సైబర్ నేరాల నియంత్రణకు సత్వర కృషి : ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సైబర్ నేరాల నియంత్రణలో బాధితులకు సత్వర న్యాయ పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. మంగళవారం ఆయన ఐటి కోర్ సైబర్ సెల్ విభాగాలను సందర్శించిన ఆయన డిజిటల్ పోలీసింగ్‌కు సంబంధించిన కీలక వ్యవస్థ పనితీరు పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిటిఎన్ఎస్ ఈ సాక్ష్య సిఇఆర్ పోర్టల్ నాట్‌గ్రిడ్ వ్యవస్థలను నిర్వహిస్తున్న సిబ్బందితో విడివిడిగా సమావేశమై ఆయా విభాగాల పనితీరు పెండింగ్ అంశాలు సాంకేతిక సమస్యలు డేటా నమోదు సేవల అమలుపై సమీక్షించారు. కేసుల వివరాలు దర్యాప్తు పురోగతి కేసుల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని సూచించారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్ల గుర్తింపు బ్లాక్ చేయడం రికవరీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నాట్‌గ్రిడ్ గాండీవ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగిస్తూ సమాచార విశ్లేషణ ద్వారా నేరాల నియంత్రణ దర్యాప్తుల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా సైబర్ నేరాల యంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని వచ్చిన ఫిర్యాదులపై తక్షణ స్పందన బాధితులకు డబ్బు రికవరీ పెండింగ్ కేసుల వేగవంతంపై దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. జిఆర్ఎం ఎంఆర్ఎం సమన్వయ సహాయోగ్ పోర్టల్లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రజలకు డిజిటల్ అరెస్టు సైబర్ మోసాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతను మెరుగు పరిచేందుకు అవసరమైన చర్య తీసుకోవాలని తెలిపారు. అవసరమైన కేసుల్లో బిఎన్ఎస్ సెక్షన్ 111 అమలు చేయాలని అధికారులకు సిబ్బంది నిరంతరం సాంకేతిక శిక్షణ పొందుతూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అన్ని విభాగాల సిబ్బంది డేటా భద్రతా ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని అధికారిక సమాచారాన్ని గోప్యంగా భద్రపరుస్తూ సైబర్ భద్రతా నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు వేగవంతమైన పారదర్శకమైన సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఆదినారాయణ సైబర్ సెల్ సిఐ జితేందర్ ఐటి కోర్ ఎస్సై గణేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జెఈఈ, ఐఐటి అధ్యాయన పుస్తకాలు విరాళం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా కేంద్ర గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం జెఈఈ మెయిన్స్, ఐఐటి అడ్వాన్స్డ్ ఇతర ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన అధ్యాయన పుస్తకాలను విరాళంగా అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో తుమ్మా గణేష్ సాయి పోటీ పరీక్షలకు సంబంధించిన అధ్యాయన పుస్తకాలను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్‌బాబా మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్‌లో ఈఈగా విధులు నిర్వహిస్తున్న తుమ్మా ధరణికుమార్ కుమారుడు తుమ్మా గణేష్ ఐఐటి ఢిల్లీలో సిఎస్‌సిలో ప్రవేశం పొందారన్నారు. తన విజయానికి ఉపయోగపడిన అధ్యాయన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి తుమ్మా గణేష్ విరాళంగా అందించడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల సేకరణను నిరంతరం చేస్తున్నామన్నారు. ఉన్నత విద్యల్లో విజయాలు సాధించిన విద్యార్థులు తమకు ఉపయోగపడిన పుస్తకాలను గ్రంథాలయాలకు విరాళంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ ఈఈ తుమ్మా ధరణి కుమార్, గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రాణవాయువును అందించే మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డా. జాన్ మిల్టన్ అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎన్ఎస్ఎస్ ఎకో క్లబ్ యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్టు ప్రగతికి మెట్టు అనే నినాదాన్ని దృష్టిలో పెట్టుకుని మనకు ప్రాణవాయువు అందించడమే కాకుండా చల్లని నీడని ఇస్తాయని చెప్పారు. అనంతరం మై భారత్ పోర్టల్ జిల్లా కన్వీనర్ రాంబాబు మాదక ద్రవ్యాల వినియోగం నష్టాలు, పర్యావరణ సమ తుల్యత పై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ హమీలా ఎన్ఎస్ఎస్ పిఓ డా.కిరణ్ కుమార్ బి సుధాకర్ రావు అధ్యాపక బృందం విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 16 నుంచి సమ్మె

**– ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్**





**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 16 నుంచి సమ్మె తప్పదని ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌లు తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై మంగళవారం హైదరాబాద్‌లో కేంద్ర కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమీషనర్ డా॥ సర్వతీరాథ్ సమక్షంలో రెండో విడత చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు, సింగరేణి యాజమాన్య ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. సమ్మె నోటీసులో ప్రధాన డిమాండ్‌గా ఉన్న మెడికల్ బోర్డు అంశంపై యాజమాన్యం ఇప్పటికే బోర్డు ద్వారా పరీక్షించిన కార్మికులను పారదర్శకంగా ఫిట్ లేదా అన్‌ఫిట్‌గా ప్రకటించకపోవడంతో పలువురు కార్మికులకు అన్యాయం జరిగిందని ఏఐటీయూసీ వాదించింది. ఇరు పక్షాల వాదనలు విన్న అసిస్టెంట్ లేబర్ కమీషనర్ ఈ నెల 17, 18 లేదీల్లో మెడికల్ బోర్డు పరీక్షలకు హాజరైన కార్మికులకు రీమెడికల్ పరీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని యాజమాన్యానికి సూచించారు. అలాగే, తదుపరి విచారణకు ముందు యాజమాన్యం, ఏఐటీయూసీ మధ్య ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి సమ్మె నోటీసులో పేర్కొన్న అన్ని డిమాండ్లపై సానుకూలంగా చర్చించి, ఆ సమావేశ నివేదికను తదుపరి విచారణలో సమర్పించాలని ఆర్ఎల్‌సీ ఆదేశించారు. తదుపరి విచారణను ఆగస్టు 6, 2026 ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. అనంతరం ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 6న జరిగే చర్చల్లో కార్మిక సమస్యలకు సానుకూల పరిష్కారం లభించకపోతే ఆగస్టు 16 నుంచి సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ తరపున అధ్యక్ష కార్యదర్శులతో పాటు అదనపు కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, వై.వి.రావు, ఎం సమ్మయ్య హాజరయ్యారు. సింగరేణి యాజమాన్యం తరపున డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) బి.రాజగోపాల్ పాల్గొన్నారు.

# యూరియా యాప్ రద్దు చేయాలి




**ప్రజాపక్షం/ఇల్లందు:** యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, అర్హులైన ప్రతి రైతుకు ఎకరాకు అవసరమైన మేర యూరియాను అందించాలని పీవైఎల్ తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివానాయక్ డి మాండ్ చేశారు. ఇల్లందు మండలం మామిడి గూడెం పంచాయితీలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పలువురు రైతులు యాప్ వినియోగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో యూరియా పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ(అశోక్ అన్న వర్గం)ఇల్లందు సబ్ డివిజన్ కార్యదర్శి గుగులోత్ రామచందర్, నాయకులు మంగన్న, వీసం శ్రీను, రైతులు బొమ్మగాని కృష్ణ, రాములు, సీతారాములు, పార్వతి, సంధ్య, కుమారస్వామి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



**ప్రజాపక్షం/బోనకల్:** ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హరితహారం ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నళిని శ్రీ మాట్లాడుతూ పర్యావరణం కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లు మనకు ప్రాణవాయువును నీడ, వర్షాలు, స్వచ్ఛమైన గాలి, పర్యావరణ సమతుల్యతను అందిస్తాయని అన్నారు. అందుకే ప్రతి మనిషి ఒక్క మొక్కను నాటి వాటి పర్యవేక్షణ చూడాలని కోరారు. నేటి కాలంలో పెరుగుతున్న కాలుష్యం అడవుల నరికివేత వాతావరణ మార్పులు వంటి సమస్యలకు చెట్లు పెంపకం ఒక ముఖ్యమైన పరిష్కారం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతి రావు, అధ్యాపకులు రాజేంద్రకుమార్, లక్ష్మీ కాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియకుమార్‌రెడ్డి, మురళీకృష్ణ, శాంతిప్రియ, యశోద, యూడిసి మదర్‌సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# రైతు నేస్తం 100వ ఎపిసోడ్ విజయవంతం



-రైతులతో కలిసి వీక్షించిన కలెక్టర్ అంకిత్
-అత్యధికంగా వీక్షించిన రైతులు, ఉత్తమ ఏఈఓలకు సత్కారం

**ప్రజాపక్షం/ములకలపల్లి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం 100వ ఎపిసోడ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 2,601 రైతు వేదికల్లో ప్రసారమైన ఈ కార్యక్రమంలో సుమారు మూడు లక్షల మంది రైతులు పాల్గొన్నారు. ములకలపల్లి మండలం పూసుగూడెం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ అంకిత్ రైతులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన శాస్త్రీయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ విధానాలను రైతులు అమలు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్ వర్చువల్‌గా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని అత్యధికంగా వీక్షించిన ముగ్గురు రైతులను, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులను జిల్లా కలెక్టర్ అంకిత్ జ్ఞాపికలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, వ్యవసాయ విస్తరన అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# విప్పలమడకకు ఫ్రీజర్ బాక్స్ వితరణ



**ప్రజాపక్షం/వైరా :** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా వైరా మండలంలోని విప్పలమడక గ్రామానికి మంగళవారం ఫ్రీజర్ బాక్స్‌ను ఉచితంగా ఇచ్చారు. గ్రామంలోని ఎస్సీ స్మశానవాటికలో ఏర్పాటు చేసిన చేతిపంపును, ఫ్రీజర్ బాక్స భద్రపరిచేందుకు నిర్మించిన గదిని కాపా మురళీకృష్ణ ప్రారంభించారు. మేడా సంపత్ అధ్యక్షతన జరిగిన సభలో కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విప్పలమడక గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మేడా శంకరయ్య సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విప్పలమడకలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా జీఈటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, బుచ్చిరామారావు, మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, ఆకుల ప్రసాద్, సోమలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ వీరపనేని చెన్నకేశవరావు, ఉప సర్పంచ్ బూర్గు లూర్ధమ్మ, న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, ఏపూరి రాజారావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, గంగవరపు కిషన్, పువ్వాడ రాము తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ముద్ర వేసిన షాలెంరాజుకు అధికారుల ఘన సత్కారం



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజు ఈ నెల 31న పదవీవిరమణ పొందనున్న సందర్భంగా మంగళవారం ఏరియా స్టోర్స్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు షాలువా కప్పి, పుష్పగుచ్చం అందజేసి ఆయనను ఘనంగా సత్కరించి పదవీవిరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత షాలెంరాజుదేనని కొనియాడారు. బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మిక సంక్షేమం, భద్రతా ప్రమాణాల అమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఆయన అందించిన సేవలు విశేషమని పేర్కొన్నారు. రామవరం డిస్పెన్సరీ పునఃప్రారంభానికి ఆయన చేసిన కృషి, రుద్రంపూర్ జయశంకర్ మైదానాన్ని ఆధునిక స్టేడియంగా తీర్చిదిద్దడం, ప్రగతి వనం పార్కును కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు ఆయన దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కొత్తగూడెం ఏరియాలో ఆయన చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. అండర్ మేనేజర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి పనిచేసే తత్వంతో జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగిన షాలెంరాజు ప్రస్థానం యువ అధికారులకు ఆదర్శంగా నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. పదవీవిరమణ అనంతరం కూడా షాలెంరాజు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ, సింగరేణి అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం గోవిందరావు, ఏరియా ఇంజనీర్ విత్తనాల రామకృష్ణ, వీకే కోల్‌మైన్ పీవో ఎం.నరసింహారావు, ఏరియా స్టోర్స్ హెచ్‌వోడీ మైనేని శ్రీనివాసరావు, స్టొర్ ఇంజనీర్ భాస్కర వెంకట రమణ, మేనేజర్ మురళి, సేఫ్టీ ఆఫీసర్ అనిల్, వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్, ఎఐటీయూసీ పిట్ కార్యదర్శి శ్రీనివాస్ (కమల్), ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి నటరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైరా వంద పడకల హాస్పిటల్ సమస్యలను పరిష్కరించాలి






**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఉన్న వంద పడకల ఆసుపత్రి సమస్యలతో సతమతం అవుతుందని, అనేక సమస్యల పరిష్కారాన్ని ప్రభుత్వం అధికారులు కృషి చేయాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం బృందం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు మచ్చా మణి, పట్టణ నాయకులు కొంగర సుధాకర్, షేక్ నాగుల్‌పాషా, ఓర్సు సీతారాములు కలిసి ఆసుపత్రిని సందర్శించారు. రోగులను వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇక్కడ పని చేయాల్సిన ఎండి ఫిజిషియన్ డాక్టర్, హోమియో డాక్టర్లను జిల్లా అధికారులు ఇక్కడి ప్రజలకు వైద్యం సేవలు అందించకుండా డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలు పంపించడం సరైంది కాదని, వెంటనే జిల్లా అధికారులు డిప్యూటేషన్‌పై పంపించిన డాక్టర్లను తిరిగి ఇక్కడ ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్థోపెడిక్ విభాగం డాక్టర్‌తో పాటు తగిన స్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. వైద్య బృందానికి రోగులు కనీసం మరుగుదొడ్ల సౌకర్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాల నుండి నత్తనడకన నడుస్తున్న 100 పడకల ఆసుపత్రి నూతన భవనాన్ని వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు స్పందించి పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన ఓరాటాలు చేపడతామని హెచ్చరించారు.

# 30న సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు

-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**ప్రజాపక్షం/బోనకల్:** దేశంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను అనుగుణంగా పార్టీ శ్రేణులను సైద్ధాంతికంగా మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో మధిర, బోనకల్, చింతకాని మండలాల కార్యకర్తలకు ఈ నెల 30వ తేదిన బోనకల్‌లో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ శిక్షణ తరగతుల్లో దేశ రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, కార్మిక, కర్షక ఉద్యమాలు, పార్టీ సిద్ధాంతాలు, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా ఉద్యమాల దిశ తదితర కీలక అంశాలపై పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా కార్యకర్తల్లో సైద్ధాంతిక స్పష్టతతో పాటు ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తిని మరింత పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని వెల్లడించారు. మధిర, బోనకల్, చింతకాని మండలాల పరిధిలోని సుమారు 500 మంది పార్టీ సభ్యులు ఈ శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు విజ్ఞప్తి చేశారు.

# ఆగస్ట్ 10న జరిగే దేశవ్యాప్త జైల్ భరోను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/వైరా:** సిపిఎం వైరా మండల కమిటీ సమావేశం వైరాలో బోడేపూడి భవన్‌లో మంగళశారం మండల కమిటీ డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన సిపిఎం వైరా వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్ట్10న దేశవ్యాప్తంగా సిఐటియు, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే జైల్ భరో కార్యక్రమానికి సిపిఎం సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తీసుకురావడంతో పాటు కార్మిక చట్టాలను కాళరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసి కార్మికుల హక్కులను హరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని, ధరల పెరుగుదల, నిరుద్యోగం, వ్యవసాయం సంక్షోభం వంటి సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుందని అన్నారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఆగస్ట్10న జరిగే దేశవ్యాప్త జైల్‌భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు, నిరుద్యోగ యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్, బాలాజి రమణ, శీలం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# విజయలక్ష్మీ నగర్‌లో బాలల గ్రామసభ



**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయలక్ష్మీ నగర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో బాలల గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి చిన్నారి విద్యను ప్రాథమిక హక్కుగా భావించి తప్పని సరిగా చదువుకోవాలని, చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి సందీప్, ఉప సర్పంచ్ రేణుక, వార్డు సభ్యులు హరిసింగ్, సదా, సౌజన్య, కళావతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా సవరణపై రాజకీయ పార్టీలు సహకరించాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశం మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సమావేశం లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ జాబితా సవరణకు పార్టీలు ప్రతినిధులు సహకరించాలని సర్ 2026 కార్యక్రమం అమలు పురోగతిని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన చర్యలు కొనసాగుతున్న ప్రక్రియలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు ,ఆయా మండలాలకు చెందిన పార్టీల ప్రతినిధులు పాల్గొనడం పాటు అధికారులు పాల్గొన్నారు.